
సాక్షి పల్నాడు

మంగళవారం । 4 । జూన్ । 2024



పంప్‌హౌస్ పరిశీలన

తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని పలు పంప్ హౌస్‌లను కార్పొరేషన్ ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, డీఈ కృష్ణారెడ్డితో కలిసి సోమవారం పరిశీలించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 504.60 అడుగుల వద్ద ఉంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 806.30 అడుగుల వద్ద ఉంది.



నిమ్మకాయల ధరలు

తెనాలి: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో సోమవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.4500, గరిష్ట ధర రూ.5700, మోడల్ ధర రూ.5200 వరకు పలికింది.

న్యూస్‌రీల్

హద్దు మీరితే రౌడీషీట్

డీఐజీ గోపీనాథ్



పెదకూరపాడు: కౌంటింగ్ సమయంలో అల్లరి మూకలు హద్దుమీరితే రౌడీషీట్‌తోపాటు కేసులు నమోదు చేస్తామని డీఐజీ జెట్టి గోపీనాథ్ అన్నారు. పెదకూరపాడు గ్రామంలో సోమవారం ఆయన పర్యటించారు. పలు సమస్యాత్మక ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. పోలీసు సిబ్బందికి పలు సూచనలు చేశారు. కౌంటింగ్ సమయంలో అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని తెలిపారు. అనంతరం సీఐ మంగరావు మాట్లాడుతూ ఇప్పటి వరకు పెదకూరపాడు సర్కిల్ పరిధిలో 18 కేసులు నమోదు చేసి 150 మందిని అరెస్టు చేసి బైండోవర్ చేశామని, బైండోవర్ చేసిన వారు అల్లర్లకు పాల్పడితే రూ.2లక్షలు జరిమానాతోపాటు 307 సెక్షన్ కింద కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రతి మండలంలో నాలుగు మొబైల్ టీంలు తిరుగుతున్నాయన్నారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెడితే చర్యలు తప్పవన్నారు. వారి వెంట ఎస్ఐ వెంకట్రావు ఉన్నారు.

గ్రామాల్లో ప్రత్యేక అడిషనల్ ఎస్పీ పర్యటన

యడ్లపాడు: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో అమలవుతున్న 144 సెక్షన్‌లో భాగంగా సోమవారం పోలీసులు మండలంలోని పలు గ్రామాల్లో సందర్శించారు. చిలకలూరిపేట నియోజకవర్గ శాంతిభద్రతల ప్రత్యేక పర్యవేక్షణాధికారి, అడిషనల్ ఎస్పీ డీవై రమణమూర్తి, సీఐ రామకృష్ణ, యడ్లపాడు ఎస్ఐ జె శామ్యూల్ రాజీవ్‌కుమార్‌తో కలిసి విస్తృతంగా గ్రామాల్లో పర్యటించారు. కొత్తపాలెం, కొండవీడు, కోట, చెంఘీజ్‌ఖాన్‌పేట, సంగం గోపాలపురం, బోయపాలెం తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లోని వ్యాపార దుకాణాలు మూతపడ్డాయా లేదా తనిఖీలు చేశారు. 144 సెక్షన్ అమల్లో ఉన్నప్పుడు ఎవరూ బయట తిరగరాదని, అనవసరమైన అల్లర్లకు పాల్పడరాదంటూ గ్రామీణులకు అవగాహన కల్పించారు.

నేలబావిలో పడి బాలుడు మృతి



మృతుడు గ్రంధి ఆనంద్

రాజుపాలెం: ఆరేళ్ల బాలుడు వ్యవసాయ నేల బావిలో పడి మృతి చెందిన సంఘటన పల్నాడు జిల్లా బ్రాహ్మణపల్లిలో సోమవారం జరిగింది. గ్రామానికి చెందిన రైతు వ్యవసాయం సాగు చేసేందుకు తన పొలంలో 20 అడుగుల నేలబావి తవ్వించాడు. ఈ బావి గ్రామానికి అతి సమీపంలో 100 అడుగుల దూరంలో ఉంది. వేసవి సెలవులు కావడంతో పిల్లలు రోజు ఆ బావిలో ఈత కొడుతుంటారు. బావి సమీపంలోనే విద్యార్థులు క్రికెట్ ఆడుతుంటారు. బావి సమీపంలో చర్చికూడా ఉంది. గ్రామానికి చెందిన గ్రంధి ఆంజనేయులు, సుజాత దంపతులకు కుమారుడు ఆనంద్(6), కుమార్తె ఉన్నారు. ఆనంద్ పిల్లలతో ఆడుకుంటూ వచ్చి ప్రమాదవశాత్తూ కాలుజారి బావిలో పడిపోయాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు బావిలో దిగి ఆనంద్‌ను బయటకు తీశారు. అప్పటికే ఆనంద్ మృతి చెందినట్లు గుర్తించారు. ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రులు, బంధువులు, గ్రామస్తులు కన్నీరుమున్నీరుగా విలపించారు. వారిని ఓదార్చుటకు ఎవ్వరివల్ల కావడంలేదు. దీనిపై ఎలాంటి కేసు నమోదు కాలేదు.

దుర్గమ్మకు రూ.3.48 కోట్ల ఆదాయం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు భక్తులు హుండీల ద్వారా రూ.3.48 కోట్లను కానుకలు, మొక్కుబడులు, ముడుపులను రూపంలో సమర్పించారు. ఆది దంపతులకు భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలు, మొక్కుబడులు, ముడుపులను సోమవారం ఆలయ ప్రాంగణంలోని మహా మండపం ఆరో అంతస్తులో లెక్కించారు. 18 రోజులకు రూ.3,48,33,515 నగదు, 535 గ్రాముల బంగారం, 7.840 కిలోల వెండి లభ్యమయ్యాయని ఆలయ అధికారులు తెలిపారు. విదేశాలకు చెందిన భక్తులు అమ్మవారికి భారీగానే కానుకలను సమర్పించారు. 601 యూఎస్ఏ డాలర్లు, 100 ఒమన్ బైసాలు, 132 యూఏఈ రియాల్స్‌లతో పాటు ఇతర దేశాలకు చెందిన కరెన్సీ లభించింది. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు ఆన్‌లైన్‌లో ఈ-హుండీ ద్వారా రూ.1.31 లక్షలను సమర్పించారు.

తేలనున్న భవితవ్యం

నేటితో ఉత్కంఠకు తెర

- నేడు సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెల్లడి
- నరసరావుపేట జేఎన్టీయూ కళాశాలలో ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి
- 15,05,199 ఓట్ల లెక్కింపునకు 230 టేబుళ్లు ఏర్పాటు
- విధులు నిర్వహించనున్న 1,307 మంది సిబ్బంది
- సగటున ఒక్కొక్క రౌండ్‌కు 25 నిమిషాల సమయం
- తొలి ఫలితం చిలకలూరిపేట, తుది ఫలితం గురజాల
- నరసరావుపేట పార్లమెంట్‌తోపాటు ఏడు అసెంబ్లీ స్థానాలకు సంబంధించి తేలనున్న 122 మంది అభ్యర్థుల భవితవ్యం
- జిల్లా వ్యాప్తంగా పటిష్ట బందోబస్తు
- గుర్తింపు కార్డు ఉంటేనే కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతి



జేఎన్‌టీయూ కళాశాలలోని కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ బి లత్కర్

సాక్షి, నరసరావుపేట: ఓటర్ తీర్పు తెలిసే రోజు రానేవచ్చింది. మే 13వ తేదీ జరిగిన పోలింగ్‌లో ప్రజలు తమ అభిప్రాయాన్ని ఈవీఎంలలో నిక్షిప్తం చేశారు. 23 రోజుల అనంతరం నరసరావుపేట పార్లమెంట్‌తో పాటు ఏడు అసెంబ్లీ స్థానాలకు సంబంధించి తేలనున్న 122 మంది అభ్యర్థుల భవితవ్యం మంగళవారం తేలనుంది. పల్నాడు జిల్లాలోని ఏడు అసెంబ్లీ, ఒక పార్లమెంట్ స్థానానికి సంబంధించిన సార్వత్రిక ఎన్నికల ఓట్లను మంగళవారం లెక్కించనున్నారు. జిల్లా కేంద్రం నరసరావుపేట సమీపంలోని కాకాని వద్ద ఉన్న జేఎన్టీయూ కళాశాలలో ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. లెక్కింపునకు అవసరమైన అన్ని ఏర్పాట్లు జిల్లా ఎన్నికల అధికారులు పూర్తి చేశారు. మంగళవారం ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఉదయం ఈవీఎం స్ట్రాంగ్ రూమ్‌లను అభ్యర్థులు, ఏజెంట్ల సమక్షంలో సీల్ తొలగించి తెరుస్తారు. కౌంటింగ్ నిమిత్తం అసెంబ్లీ, పార్లమెంటు స్థానాల వారీగా పోలింగ్ సిబ్బందిని కేటాయించారు. వీరికి ఉదయం ఐదు గంటలకు ర్యాండం పద్ధతిలో టేబుళ్లు కేటాయిస్తారు.

ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద కట్టుదిట్ట భద్రత

ఓట్ల లెక్కింపు కేంద్ర బలగాల పహారా మధ్య మూడంచెల భద్రతా వ్యవస్థలో సాగుతోంది. సీసీ కెమెరాలు, వీడియో చిత్రీకరణ మధ్య ఓట్ల లెక్కింపు సాగనుంది. ఓట్ల లెక్కింపు కేంద్రంలోకి అభ్యర్థులు, ఏజెంట్లు, మీడియా ప్రతినిధులను మాత్రమే అనుమతిస్తారు. వీరిందరికి గుర్తింపు కార్డులు ఇచ్చామని, గుర్తింపు కార్డు ఉంటే కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతి ఇస్తామని కలెక్టర్ తెలిపారు. కౌంటింగ్ కేంద్రంలోకి సెల్‌ఫోన్‌లు, క్యాలుకులేటర్‌లు అనుమతించరు. కౌంటింగ్ కేంద్రం వద్ద 155 సీసీ కెమెరాలు, డ్రోన్లు నిరంతర నిఘాలో ఉండనున్నాయి. వీటన్నింటిని కంట్రోల్ రూంకు అనుసంధానం చేశారు. ఇతరులు డ్రోన్లు, ఎగిరే పరికరాలు ఆ ప్రాంతంలో ఎగరవేయకుండా నో ఫ్లై జోన్‌గా ప్రకటించారు.

తొలుత పోస్టల్ బ్యాలెట్ ఓట్లతో...

మే 13న జరిగిన పోలింగ్‌లో జిల్లాలో 1,929 పోలింగ్ బూత్‌లలో ఎన్నికలు జరగగా మొత్తం 17,34,858 ఓట్లకుగాను ఈవీఎం, పోస్టల్, హోం ఓటింగ్‌లతో కలిపి మొత్తం 15,05,199 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం ఓట్లలో 86.76 పోలింగ్ శాతం నమోదైంది. ఇందులో తొలుత పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్ ఓట్లను లెక్కించనున్నారు. ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్, సర్వీస్ ఓట్లు మొత్తం కలిపి జిల్లాలో 19,045 ఓట్లు ఉన్నాయి. వీటి లెక్కింపుకు మూడు రౌండ్లు అవసరం కాగా పార్లమెంట్‌కు 18 టేబుళ్లు, అసెంబ్లీకి 16 టేబుళ్లు ఏర్పాటు చేశారు. రిజర్వు సిబ్బందితో కలిపి మొత్తం 271 మంది విధులు నిర్వహించనున్నారు. ఇందులో 1,304 సర్వీస్ ఓట్లు ఉండగా వాటిని స్కాన్ చేసి నమోదు చేయడానికి నాలుగు సిస్టమ్స్‌ను వినియోగించనున్నారు. పోస్టల్ బ్యాలెట్ సాయంత్రం 5 గంటల వరకు కొనసాగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

నియోజకవర్గం	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	పోలింగ్ బూత్‌ల సంఖ్య	కౌంటింగ్ రౌండ్ల సంఖ్య
పెదకూరపాడు	2,32,453	2,09,689	266	19
చిలకలూరిపేట	2,26,646	1,95,220	241	18
నరసరావుపేట	2,32,778	1,92,428	246	18
సత్తెనపల్లి	2,42,047	2,13,113	274	20
వినుకొండ	2,64,559	2,38,947	299	22
గురజాల	2,73,971	2,33,315	304	22
మాచర్ల	2,62,404	2,22,487	299	22
మొత్తం	17,34,858	15,05,199	1,929	141



కౌంటింగ్ కేంద్రం వద్ద పోలీసులు ఎగురవేస్తున్న డ్రోన్

సగటున 25 నిమిషాలకో రౌండ్ ఫలితం...

ఈవీఎంల్లో నిక్షిప్తమైన ఓట్లను లెక్కించేందుకు నరసరావుపేట పార్లమెంట్ స్థానం ఓట్ల లెక్కింపునకు ఒక్కొక్క అసెంబ్లీ స్థానానికి 14 టేబుళ్ల చొప్పున మొత్తం 98 టేబుళ్లు ఏర్పాటు చేశారు. ఒక్కో రౌండ్‌లో 14 ఈవీఎంలను ఒక్కో టేబుల్‌పై ఉంచి లెక్కిస్తారు. సగటున 25 నిమిషాలలో ఒక రౌండ్ ఫలితం లెక్క తేలనుంది. మొత్తం 141 రౌండ్లలో ఫలితం తేలనుంది. ఈ లెక్కింపునకు ఏఆర్వోలు, కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లు, డేటా ఎంట్రీ, క్లాస్-4 సిబ్బందితో కలిపి మొత్తం 434 మంది అవసరం కాగా రిజర్వ్‌తో కలిపి మొత్తం 518 మంది సిబ్బంది అందుబాటులో ఉండనున్నారు. ఇదే విధంగా ఏడు అసెంబ్లీ స్థానాల ఓట్ల లెక్కింపునకు 98 టేబుళ్ల 141 రౌండ్లు కౌంటింగ్ జరగనుంది. వీటికి మరో 518 మంది సిబ్బంది విధులు నిర్వహించనున్నారు.

తొలి ఫలితం చిలకలూరిపేట...

ప్రతి రౌండ్ కౌంటింగ్ పూర్తయిన తరువాత వచ్చిన ఫలితాలను ఎన్నికల సంఘానికి చెందిన ఎన్‌కోర్‌లో ఎన్నికల అధికారులు అప్‌లోడ్ చేయనున్నారు. పోలింగ్ కేంద్రాల సంఖ్య, అభ్యర్థుల సంఖ్య, పోలైన ఓట్ల సంఖ్య ఆధారంగా ఓట్ల లెక్కింపు రౌండ్లను నిర్ణయించనున్నారు. జిల్లాలో చిలకలూరిపేటలో అత్యల్పంగా 241 పోలింగ్ బూత్‌లు ఉండటంతో అక్కడ 18 రౌండ్లలోనే ఫలితం తేలనుంది. అత్యధికంగా గురజాలలో 304 పోలింగ్ బూత్‌లు ఉండటంతో అక్కడ ఫలితాల వెల్లడి చివరన ఉండే అవకాశం ఉంది.

ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్

జిల్లాలో సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శ్రీకేశ్ బి.లత్కర్ తెలిపారు. జేఎన్‌టీయూ లెక్కింపు కేంద్రంలో ఏర్పాట్లను సోమవారం ఆయన పరిశీలించారు. ఈవీఎం ఓట్ల లెక్కింపునకు 14 కౌంటింగ్ హాల్స్, పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు ఒక కౌంటింగ్ హాలు కలిపి 15 కౌంటింగ్ హాల్స్ ఏర్పాటు చేశామని తెలిపారు. అన్ని కౌంటింగ్ కేంద్రాల్లో ఇనుప మెస్‌లతో గట్టి బారికేడింగ్ ఏర్పాటు చేశామని, అన్ని కౌంటింగ్ హాల్స్‌లో ఏసీలను ఏర్పాటు చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉందని, లెక్కింపు కేంద్రం వద్ద గట్టి బందోబస్తు, నిఘా ఏర్పాటు చేశామన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అరెస్టు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. కౌంటింగ్ కేంద్రం వద్దకు వచ్చే సిబ్బందికి, ఎన్నికల ఏజెంట్లకు ప్రత్యేక మార్గాలు ఏర్పాటు చేశామన్నారు. సూచికలు, పోలీసు సిబ్బంది మార్గనిర్దేశం మేరకు అనుసరించాలని ఆయన పేర్కొన్నారు.

ధరావతు... ప్రజాదరణకు గుర్తు

- అదో ప్రతిష్టాత్మక ప్రక్రియగా స్వతంత్రుల భావన
- జిల్లాలోని ఏడు నియోజకవర్గాలో 107 మంది అభ్యర్థులు పోటీ

సత్తెనపల్లి: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సమయం రానే వచ్చేసింది. గెలుపోటములపై అందరి దృష్టి ఉండగా, స్వతంత్రులు, చిన్నాచితకా పార్టీల తరఫున బరిలో ఉన్న అభ్యర్థులు మాత్రం డిపాజిట్లు దక్కుతాయా లేదా అనే ఆందోళనలో ఉన్నారు. ఎందుకంటే వారిపై ఉన్న ప్రజాదరణకు సూచిక కాబట్టి. వచ్చిన ఫలితాన్ని బట్టి భవిష్యత్తులో ప్రధాన పార్టీలు వారిని చేర్చుకునేందుకు ప్రాధాన్యం కనబరుస్తాయి. అందుకే కొందరు స్వతంత్రులుగా పోటీ చేసి ప్రజాబలం నిరూపించుకునే ప్రయత్నం చేస్తుంటారు.

బరిలో 107 మంది అభ్యర్థులు..

జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో మొత్తం 107 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. పోటీ వైఎస్సార్‌సీపీ, ఎన్డీఏ కూటమి మధ్యనే కొనసాగింది. ప్రధాన పార్టీల అభ్యర్థులు 14 మందిని పక్కన పెడితే మిగిలిన 93 మంది స్వతంత్రులు, చిన్న చిన్న పార్టీల తరఫున పోటీ చేసినవారే. వీరిలో ఎందరికీ డిపాజిట్ వస్తుందో అన్నది ఇప్పుడు చర్చనీయాంశం.

ఇలా పరిగణలోకి తీసుకుంటారు..

ఓట్ల లెక్కింపు సమయంలో నోటాకు పడినవి, పోస్టల్ ఓట్లలో చెల్లకుండా పోయినవి తొలగిస్తారు. ఆ తరువాత చెల్లుబాటు అయిన వాటిల్లో 1/6 వంతు సాధించిన వారికి డిపాజిట్ దక్కినట్లుగా గుర్తిస్తారు. ఇంతకంటే తక్కువ సాధించిన వారి డిపాజిట్‌ను తిరిగి చెల్లించరు. ఎన్నికల్లో గెలిచిన వారికి, 1/6 వంతు కన్నా అధికంగా ఓట్లు వచ్చిన వారికి మాత్రమే డిపాజిట్ మొత్తం తిరిగి ఇస్తారు.

సొమ్ము ప్రధానం కాదు..

డిపాజిట్ గల్లంతైతే ఆర్థికంగా జరిగే నష్టం పెద్దగా ఉండదు. కానీ అదో ప్రతిష్టాత్మక ప్రక్రియగా భావిస్తారు. నామినేషన్ వేసే సమయంలో జనరల్ అభ్యర్థులు అయితే డిపాజిట్‌గా రూ.10 వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు అయితే రూ.ఐదు వేలు చెల్లించాలి. ఎన్నికల సంఘానికి చెల్లించిన ఆ డిపాజిట్ తిరిగి రాబట్టుకోవడమే ఇక్కడ అత్యంత ప్రతిష్టాత్మకం. భవిష్యత్ రాజకీయాల్లో నాయకుడిగా ఎదిగేందుకు దోహదకారిగా ఉంటుంది. ప్రధాన పార్టీలో కాకుండా బరిలో నిలిచిన 93 మందిలో ఎంత మందికి డిపాజిట్ వస్తుందో చూడాలి మరి.

ఓట్ల లెక్కింపును విజయవంతంగా నిర్వహించాలి

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ లత్కర్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ లత్కర్, పరిశీలకులు రవిశంకర్‌శర్మ

నరసరావుపేట: ఓట్ల లెక్కింపు ప్రక్రియను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని విధాలుగా సంసిద్ధమవ్వాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ బి లత్కర్ ఎన్నికల అధికారులు, సిబ్బందికి సూచించారు. సోమవారం జేఎన్‌టీయూలో మంగళవారం నిర్వహించే ఓట్ల లెక్కింపునకు సంబంధించి నియోజకవర్గాల వారీగా వివిధ ప్రదేశాలలో ఎన్నికల అధికారులు, సిబ్బందికి ఏర్పాటుచేసిన శిక్షణ తరగతులను ఆయన సందర్శించి పలు సూచనలు చేశారు. ఓట్ల లెక్కింపు సమయంలో ఎలాంటి సమస్య తలెత్తినా గందరగోళానికి గురికావద్దని, సమస్యను సంబంధిత నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు ఎన్నికల సంఘం నిబంధనలను కచ్చితంగా పాటించాలన్నారు. ఏజెంట్ల కోరిక మేరకు బ్యాలెట్లు, పోలైన ఓట్లను మరోమారు వారికి చూపించాలన్నారు. అభ్యర్థులకు పోలైన ఓట్ల అంకెలను స్పష్టంగా పేర్కొనాలన్నారు. ఓట్ల లెక్కింపునకు ముందు చేయాల్సిన ప్రక్రియ చాలా ఉంటుందని, ఈ నేపథ్యంలో ఎన్నికల లెక్కింపు సిబ్బంది తెల్లవారుజామున 4.30 గంటలకే కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. కౌంటింగ్ కేంద్రానికి చేరుకునేందుకు నరసరావుపేట ఆర్టీసీ బస్టాండ్ నుంచి ఉదయం నాల్గు గంటలు నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామని అవసరమైన వారు ఉపయోగించుకోవాలని కోరారు. మంగళవారం ఉదయం 5.30 గంటలకు కౌంటింగ్ సిబ్బందికి ర్యాండమైజేషన్ ద్వారా టేబుల్స్ కేటాయించనున్నన్నట్లు తెలిపారు. ఎన్నికల పరిశీలకులు రవిశంకర్‌శర్మ మాట్లాడుతూ కౌంటింగ్ ప్రక్రియ నిష్పక్షపాతంగా, నిర్భయంగా, ప్రశాంతంగా, దీక్షగా చేపట్టాలన్నారు. జాయింట్ కలెక్టర్ ఏ.శ్యాంప్రసాదు, జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్వోలు, ఏఆర్వోలు బాధ్యతగా పనిచేయండి

నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా ఎన్నికల అధికారి శ్రీకేశ్ బి.లత్కర్ ఆదేశించారు. సోమవారం సాయంత్రం కాకాని వద్ద జేఎన్టీయూ కౌంటింగ్ సెంటర్లో వారితో కౌంటింగ్ ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కౌంటింగ్ విధులలో అలసత్వం వహించకుండా నిబంధనల మేరకు కౌంటింగ్ ప్రక్రియను పూర్తిచేయాలని కోరారు. విధులలో అలసత్వం వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏదైనా సమస్యలు ఎదురైనప్పుడు తక్షణమే స్పందించి పరిష్కరించేలా ఆర్వోలు, ఏఆర్వోలు పనిచేయాలన్నారు. కౌంటింగ్ సెంటర్లో అన్ని ఏర్పాట్లు, సౌకర్యాలను పూర్తిచేసి రేపటి కౌంటింగ్ ప్రక్రియకు సన్నద్ధంగా ఉంచాలన్నారు. జేసీ ఏ.శ్యాంప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం పాల్గొన్నారు.

ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బోల్తా



ప్రమాదంలో పల్టీ కొట్టిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు



ప్రమాదంలో మృతి చెందిన మహిళ దివ్య

- ఒకరు మృతి
- ముగ్గురికి తీవ్ర గాయాలు
- 19 మందికి స్వల్ప గాయాలు

నరసరావుపేటరూరల్: రోడ్డుకు అడ్డుగా ఉన్న చెట్టు కొమ్మలను తప్పించే ప్రయత్నంలో ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బోల్తా కొట్టింది. మండలంలోని పెట్లూరివారిపాలెం వద్ద చోటుచేసుకున్న ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. కర్ణాటక రాష్ట్రం గంగావతి నుంచి యానంకు తులసీ ట్రావెల్స్ బస్సు ఆదివారం రాత్రి 39 మంది ప్రయాణికులతో బయలుదేరింది. తెల్లవారుజామున ఐదు గంటల సమయంలో నరసరావుపేట మండలం పెట్లూరివారిపాలెం సమీపంలోకి బస్సు చేరుకున్న సమయంలో ప్రమాదానికి గురైంది. గత రాత్రి కురిసిన వర్షానికి చెట్టు కొమ్మలు విరిగి రోడ్డుపై పడ్డాయి. వేగంగా బస్సును నడుపుతున్న డ్రైవర్ రోడ్డుపై అడ్డుగా పడిఉన్న చెట్టు కొమ్మలను గమనించి వాటిని తప్పించే ప్రయత్నంలో ఆకస్మాత్తుగా బ్రేక్ వేశాడు. బస్సు అదుపుతప్పి పక్కకు పల్టీకొట్టి చెట్టును ఢీకొన్నది. ఈ ప్రమాదంలో విజయవాడకు చెందిన నిమ్మగడ్డ దివ్య(35) బస్సు కింద పడి అక్కడికక్కడే మృతి చెందింది. డ్రైవర్‌తో పాటు ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా మరో 19 మందికి స్వల్పగాయాలయ్యాయి. గాయపడిన వారిని నరసరావుపేటలోని ప్రైవేటు ఆసుపత్రులకు తరలించి చికిత్స అందించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తల్లిదండ్రులపై హత్యాయత్నం

- ఓ కొడుకు ఘాతుకం
- ఆస్తి కోసం భార్యతో కలిసి రాడ్డుతో దాడి
- గుంటూరు నగరంలో ఘటన
- జీజీహెచ్‌లో చేరిన బాధితులు





జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న మోహన్‌రావు, నేత్రావతి

గుంటూరు ఈస్ట్: ఆస్తి కోసం కన్న తల్లిదండ్రులనే కడతేర్చాలని చూశాడు ఓ కొడుకు. భార్యతో కలిసి తండ్రిని, మారు తల్లిని అత్యంత కిరాతకంగా రాడ్డు, సుత్తితో దాడిచేసి తీవ్రంగా గాయపరిచాడు. ప్రాణ భయంతో ఆ తల్లిదండ్రులు కాళ్ల మీద పడి వేడుకున్నా కనికరించలేదు. ప్రస్తుతం బాధితులు ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గుంటూరు నగరంలో ఈ హృదయ విదారక ఘటన జరిగింది. బాధితురాలు నేత్రావతి కథనం ప్రకారం లక్ష్మీనగర్‌లో నివసించే వేమన మోహనరావు భార్యతో విడిపోయి తన కుమారుడు శ్రవంత్‌కుమార్‌కు ఐదేళ్ల వయస్సు ఉన్నప్పుడే నేత్రావతిని రెండో పెళ్లి చేసుకున్నాడు. నేత్రావతికి పిల్లలు పుట్టలేదు. శ్రవంత్‌కుమార్‌ను ఆ దంపతులు అల్లారుముద్దుగా పెంచుకున్నారు. మోహన్‌రావు లారీ డ్రైవర్. పెద్ద అయిన తరువాత కుమారుడికి వరుసగా మూడు లారీలు కొనిపెట్టాడు. అయితే శ్రవంత్‌కుమార్ నష్టాలు వచ్చి వాటి అమ్మేశాడు. మోహన్‌రావుకు రెండు ఇళ్లు ఉండటంతో ఒక ఇంటిని భార్య నేత్రావతి పేరు మీద రాశాడు. శ్రవంత్‌కుమార్ పెళ్లయిన రెండేళ్ల తరువాత నుంచి రెండు ఇళ్లు తన పేరు మీద రాయాలని తల్లిదండ్రులతో తరచూ గొడవ పడుతున్నాడు. ఈ క్రమంలో కోడలు రాజేశ్వరి, అత్తమామలను తరుచూ వేధిస్తోంది. గతంలో ఆస్తి రాయలేదనే అక్కసుతో మామ తనతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడంటూ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసి కేసు నమోదు చేయించింది. అయినా మోహన్‌రావు కుమారుడి కుటుంబానికి తరచూ ఆర్థిక సహాయం చేస్తూ వచ్చాడు. రెండు లారీలు అమ్మివేసినా మూడో లారీ కొనిపించాడు. ఆరు నెలల క్రితం మనవరాలు అనారోగ్యానికి గురైతే కుమారుడికి రూ.2లక్షలు ఇచ్చాడు. ఇటీవల మనవరాలు పదో తరగతి పుస్తకాలు కొనుగోలు చేసేందుకు రూ.10 వేలు వెచ్చించాడు. అయినా శ్రవంత్‌కుమార్, అతని భార్య రాజేశ్వరి తరచూ తండ్రి, మారు తల్లితో గొడవలు పడుతూ ఉన్నారు. ఎట్టకేలకు శ్రవంత్‌కుమార్, అతని భార్య రాజేశ్వరి తల్లిదండ్రులను హతమార్చేందుకు పథకం వేశారు. సోమవారం మోహన్‌రావు డ్యూటీ నుంచి వచ్చి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో కొడుకు, కోడలు ఇద్దరూ రాడ్డు, సుత్తిలతో ఇంట్లోకి వచ్చారు. తొలుత మోహన్‌రావు, నేత్రావతి కళ్లల్లో కారం చల్లారు. అనంతరం శ్రవంత్‌కుమార్ రాడ్డుతో పలు మార్లు మోహన్‌రావు తలపై తీవ్రంగా మోదాడు. కొడుకు కాళ్లు పట్టుకుని చంపవద్దంటూ మోహన్‌రావు ప్రాధేయపడ్డా వారు కనికరించలేదు. రాజేశ్వరి తన అత్త నేత్రావతి తలపై సుత్తితో పలు మార్లు మోదింది. దంపతుల కేకలు విన్న స్థానికులు వచ్చి చూసి సమీపంలో ఉన్న ఏఎస్సై పద్మావతికి చెప్పారు. పద్మావతి తన బంధువులతో కలిసి వచ్చి శ్రవంత్ కుమార్, రాజేశ్వరిని నిలువరించారు. కొద్దిసేపటికి పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి మోహన్‌రావు, నేత్రావతిలను 108 అంబులెన్సు ద్వారా జీజీహెచ్‌కు తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

పశ్చిమ గోదావరిపై కృష్ణా జట్టు విజయం

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ, ఎస్‌కెఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న ఆంధ్రా సెంట్రల్ జోన్ అండర్‌-19 అంతర్ జిల్లాల బాలుర క్రికెట్ పోటీలలో భాగంగా సోమవారం కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల మధ్య జరిగిన మ్యాచ్‌లో కృష్ణాజిల్లా జట్టు 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకొన్న పశ్చిమగోదావరి జట్టు 36 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 159 పరుగులు చేసింది. జట్టులోని రేవంత్‌నాగకుమార్ 98బంతుల్లో 69, చరణ్‌సాయితేజా 61బంతుల్లో 40 పరుగులు సాధించారు. కృష్ణాజిల్లా బౌలర్ సాయిప్రకాష్‌కు రెండు వికెట్లు లభించాయి. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కృష్ణా జట్టు 28 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 162 పరుగులతో విజయం సాధించింది. కృష్ణా జిల్లా బ్యాట్స్‌మెన్ సోహన్ 39, ఖాజామొహిద్దీన్ 34 పరుగులు సాధించారు. పశ్చిమ గోదావరి జట్టు బౌలర్లు అశ్వింత్, చరణ్‌సాయితేజా 2 వికెట్లు చొప్పున సాధించారు. మ్యాచ్‌ను ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు కె.వి.పురుషోత్తమరావు, గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎన్.సీతాపతిరావు పర్యవేక్షించారు.

మరోసారి ఏపీ ముఖ్యమంత్రి జగనే

మాచర్ల: పేద, బడుగు, గిరిజన, మైనార్టీ వర్గాలను నిత్యం ఆదుకుంటూ ఐదు సంవత్సరాలు వారి కుటుంబంలో వెలుగు నింపిన సీఎం జగన్ మోహన్‌రెడ్డి మంగళవారం సాయంత్రం కల్లా ఎన్నికల ఫలితాలు విడుదల కాగానే త్వరలోనే మరోసారి ముఖ్యమంత్రిగా జగన్ ప్రమాణ స్వీకారం చేస్తారని గిరిజన ప్రజా సమైఖ్య జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు వడిత్యా శంకర్ నాయక్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులకు ప్రకటన విడుదల చేశారు. టీడీపీ ఎగ్జిట్‌పోల్స్‌ను తమకనుకూలంగా ఎన్ని కుయుక్తులు పన్నినా ప్రజలు సీఎం జగన్ వెంటే ఉన్నారన్నారు. ప్రజలకు మంచి చేసిన వారే తమ రాష్ట్ర సీఎంగా ఉండాలని జగన్‌కు మరోసారి పట్టం కట్టనున్నారని ఆయన ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతిపక్షాలు ఇక దుష్ప్రచారాన్ని ఆపి ప్రజల అభిమానంతో కాబోయే సీఎం జగన్ పరిపాలనను మరొకసారి చూడాలన్నారు.

పిడుగురాళ్ల ప్రశాంతం

పిడుగురాళ్ల : పిడుగురాళ్ల పట్టణంలో ప్రశాంత వాతావరణం నెలకొంది. మంగళవారం ఓట్ల లెక్కింపు నేపథ్యంలో పల్నాడు జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బీ లత్కర్, జిల్లా ఎస్పీ మలికా గార్గ్ ఆదేశాల మేరకు 144 సెక్షన్ అమలులో ఉంది. వ్యాపారస్తులందరు స్వచ్ఛందంగా వ్యాపార సముదాయాలన్నీ మూసివేశారు. పిడుగురాళ్ల ప్రధాన వీధుల తోపాటు అన్ని వీధులు ప్రశాంత వాతావరణంలో ఉన్నాయి. ప్రజల రాకపోకలు కూడా లేకపోవటంతో అంతా ప్రశాంతంగా మారింది.

నిఘా వలయంలో సత్తెనపల్లి సబ్‌డివిజన్

- నేడు ఓట్ల లెక్కింపు సందర్భంగా భద్రతా పర్యవేక్షణ
- 6వ తేదీ వరకు 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలు
- ఊరేగింపులు, విజయోత్సవాలు, బాణసంచా పేల్చడం నిషేధం
- సబ్‌డివిజన్‌లోని సీఐలు, ఎస్‌ఐలతో అడిషనల్ డీజీ గోపీనాథ్ జెట్టి సమీక్ష
- సత్తెనపల్లి డీఎస్పీ గుర్‌నాథ్‌బాబు


పట్టణంలో పర్యటిస్తూ హెచ్చరికలు చేస్తున్న పోలీసుల వాహనం

సత్తెనపల్లి: ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియకు.. శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా సత్తెనపల్లి సబ్ డివిజన్ అంతటా పోలీసులు హై అలర్ట్ ప్రకటించారు. ఎన్నికల ప్రకటన వెలువడిన మార్చి 16 నుంచి ప్రవర్తనా నియమావళి అమలులో ఉంది. ఓట్ల లెక్కింపు రోజు కూడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చూసేందుకు పక్కా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి రౌడీషీటర్లపై పోలీసులు ఫోకస్ పెట్టారు. రౌడీషీటర్లతోపాటు నేర ప్రవర్తన ఉన్న మూడు వేల మందిని బైండోవర్ చేశారు. ఎన్నికల అనంతరం 400 మందిని బైండోవర్ చేశారు. వీరిలో 62 మంది తిరిగి గొడవలు, అల్లర్లలో పాల్గొనడం గుర్తించారు. 75 మందికి నోటీసులు జారీ చేశారు. అంతేకాక ఎన్నికల అనంతరం సబ్‌డివిజన్లో 171 మందిపై రౌడీషీట్లు ఓపెన్ చేశారు. 60 గ్రామాల్లో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ముప్పాళ్ల మండలం మాదల గ్రామంలో 29 పెట్రోల్ బాంబులు స్వాధీనం చేసుకోగా రాజుపాలెం మండలం బ్రాహ్మణపల్లిలోని తోటలో పెట్రోల్ బాంబులు తయారీకి సిద్ధంగా ఉంచిన ముడి సరుకు స్వాధీనపరుచుకున్నారు. డాక్యుమెంట్ లేని 175 వాహనాలను స్వాధీనపరుచుకున్నారు. 49 గ్రామాలలో పోలీస్ పికెట్లు నిర్వహిస్తుండగా ఎన్నికల అనంతరం 49 కేసులు నమోదు చేశారు.

సబ్ డివిజన్‌లోని సీఐలు, ఎస్‌ఐలతో సమీక్ష

సత్తెనపల్లి సబ్ డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్‌ఐలతో పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో అడిషనల్ డీజీ, పల్నాడు జిల్లా ఇన్‌చార్జి గోపీనాథ్ జెట్టి సోమవారం సమీక్ష నిర్వహించారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకూడదని, సబ్ డివిజన్ అంతటా 144 సెక్షన్ మరింత కఠినంగా అమలు చేయాలని ఆదేశాలు ఇచ్చారు. ప్రజలు ఒకే చోట గుమ్మికూడి ఉండటాన్ని ఈ చట్టం ద్వారా నిషేధించాలని, పోలీస్ యాక్ట్ సెక్షన్ 30 అమలు చేయాలన్నారు. దీని ద్వారా పోలీసులు నుంచి ముందస్తు అనుమతి లేకుండా ర్యాలీలు, సభలు నిర్వహించటానికి వీలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక ప్రాంతాల్లో నిరంతర నిఘా కోసం అదనపు పోలీసు బలగాలతో పికెట్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

బలగాలతో పటిష్ట బందోబస్తు

సత్తెనపల్లి సబ్ డివిజన్ పరిధిలోని సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లో ఓట్ల లెక్కింపు రోజు ఆందోళనలు, ధర్నాలు, నిరసనలు నిషేధించారు. గెలిచిన అభ్యర్థులు వారి అనుచరులు విజయోత్సవ ర్యాలీలు, డీజేలతో సంబరాలు నిర్వహించరాదని తేల్చి చెప్పారు. ఇప్పటికే బాణసంచా విక్రయాలు, బాటిళ్లలో పెట్రోల్ అమ్మకాలను నిషేధించారు. మద్యం అమ్మకాలను నియంత్రించేందుకు చర్యలు చేపట్టారు.

అవగాహన కార్యక్రమాలతో అప్రమత్తం

ప్రశాంత కౌంటింగ్ లక్ష్యంగా పోలీస్ శాఖ ఇప్పటికే వివిధ రూపాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించింది. సబ్ డివిజన్ అంతటా సాయుధ బలగాలతో ఫ్లాగ్ మార్చ్‌తోపాటు కార్డన్ సెర్చ్‌లు నిర్వహిస్తోంది. ఎన్నికల ఫలితాలపై అల్లరి మూకలు ఆందోళనలను కట్టడి చేసే దృశ్యాలను డెమో (మాక్‌డ్రిల్) ద్వారా ప్రజలకు అర్థమయ్యేలా ప్రదర్శించారు. ఆందోళనలు నిర్వహిస్తే అడ్డుకోవడం నుంచి భాష్పవాయు ప్రయోగం, గాలిలోకి కాల్పులు, లాఠీచార్జి వంటి పోలీస్ చర్యలు, గొడవలు, విద్వేషాలు, అల్లర్లు సృష్టించి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎలాంటి చర్యలు ఉంటాయో ప్రదర్శన రూపంలో తెలిపారు. ఓటర్ల తీర్పు వెలువడయ్యే సమయం దగ్గరపడిన తరుణంలో మునుపెన్నడూ లేని విధంగా కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

అల్లర్లలో పాల్గొంటే జీవితం నాశనమే



యువత గొడవలు, అల్లర్లలో పాల్గొంటే కేసులు నమోదవుతాయి. ఇలా కేసుల్లో ఇరుక్కుంటే భవిష్యత్తులో ఉద్యోగాలు రావు. ఎన్నికల సమయంలో విజేతలు ఎవరో తేలే సమయం వచ్చిన తరుణంలో కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బలగాలను సిద్ధం చేశాం. ఈనెల 6 వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉంది. మంగళవారం కౌంటింగ్ రోజున ఎవరూ బయటికి రావద్దు. దుకాణాలు తీయవద్దు. 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుంది. విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులు చేయవద్దు. ఉత్తర్వులు ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదు.

–జి.గురునాథ్‌బాబు, డీఎస్పీ, సత్తెనపల్లి

కొత్త వ్యక్తులకు అనుమతి లేదు

- పిడుగురాళ్ల పట్టణ సీఐ ఆంజనేయులు
- పట్టణంలో పలుచోట్ల చెక్‌పోస్టులు
- విస్తృతంగా తనిఖీలు
- గ్రామాల్లో ప్రత్యేక బలగాల మోహరింపు


మాట్లాడుతున్న సీఐ ఆంజనేయులు

పిడుగురాళ్ల: ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు పట్టణంలోకి కొత్త వ్యక్తులకు అనుమతి లేదని, పట్టణానికి నాలుగువైపులా చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి తనిఖీలు నిర్వహిస్తున్నట్లు పట్టణ సీఐ పీవీ ఆంజనేయులు చెప్పారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ... మే 13న జరిగిన ఎన్నికలు ఈ నెల 4వ తేదీన లెక్కింపు కార్యక్రమాన్ని పురస్కరించుకొని పూర్తిస్థాయిలో భద్రతా కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు. పిడుగురాళ్ల పట్టణంలో సమస్యాత్మక ప్రాంతాలైన శివాలయం బజారు, ఐలాండ్ సెంటర్, పోలీస్‌స్టేషన్ పరిసర ప్రాంతం, మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు కార్యాలయం వద్ద, వైఎస్సార్ సీపీ కార్యాలయంలతోపాటు మరికొన్ని ప్రాంతాల్లో ప్రత్యేక బలగాలతో ప్రహరా నిర్వహిస్తున్నామన్నారు. మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన పెద అగ్రహారం, తుమ్మలచెరువు, బ్రాహ్మణపల్లి, కరాలపాడు, జానపాడు, జూలకల్లు, గుత్తికొండ, కోనంకి, పాతగణేశునిపాడు వంటి గ్రామాల్లో ప్రత్యేక బలగాలను మోహరించినట్లు తెలిపారు.

ప్రత్యేక డ్రోన్‌లతో నిఘా...

సమస్యాత్మక గ్రామాల్లో డ్రోన్‌లతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రధాన వీధుల్లో ప్రజలు గుంపులుగా చేరి గొడవలకు, అల్లర్లకు పాల్పడితే వెంటనే డ్రోన్ కెమెరాలతో ఫొటోలు, వీడియోలు తీసి తక్షణమే పోలీసులు యాక్షన్ తీసుకుంటామని తెలిపారు. ఇద్దరు ఎస్‌ఐలతో మొబైల్ టీమ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పట్టణంలోని లాడ్జిలు, కల్యాణ మండపాలలోని రూమ్‌లన్నీ ఖాళీ చేయించినట్లు తెలిపారు. వ్యాపార దుకాణాలన్నీ స్వచ్ఛందంగా బంద్ చేయటం జరిగిందన్నారు. ప్రజలు రోడ్లపైకి రాకూడదని, ఎటువంటి సంబరాలు నిర్వహించేందుకు అనుమతులు లేవని తెలిపారు. బాణసంచా కాల్చేందుకు అనుమతులు లేవని తెలిపారు. వీటిని అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

అమరావతిలో కర్ఫ్యూ వాతావరణం


నిర్మానుష్యంగా ఉన్న అమరావతి ప్రధాన రహదారి


క్రోసూరు రోడ్

అమరావతి: అమరావతిలో కర్ఫ్యూ వాతావరణం నెలకొంది. గతనెల 13వ తేదీన నిర్వహించిన పోలింగ్ సందర్భంగా పల్నాడు జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో జరిగిన అల్లర్లను పురస్కరించుకుని ఎన్నికల కమిషన్ ఆదేశాలతో పోలీసులు ఈనెల 5వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా 144వ సెక్షన్ విధించారు. మంళవారం ఓట్ల లెక్కింపు జరిగి ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో ముందు జాగ్రత్తగా పోలీసు శాఖ మరిన్ని జాగ్రత్త చర్యలు చేపట్టింది. బుధవారం వరకు దుకాణాలు మూసివేయాలని ఆదేశించింది. దీంతో అమరావతిలో కర్ఫ్యూ వాతావరణం నెలకొంది. దుకాణాలు మూసివేయడంతో నిత్యావసర సరకుల కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం అమరావతి సర్కిల్ ఇనస్పెక్టర్ ఎ.వి బ్రహ్మం మాట్లాడుతూ జిల్లాలో ఉన్న ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పాల బూత్‌లు, మందుల షాపులు తెరచి ఉంచవచ్చని, ఉదయం పూట కొన్ని గంటల పాటు కూరగాయలు అమ్ముకోవటానికి అనుమతి కోసం ఉన్నాతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామన్నారు. జిల్లాలో శాంతిభద్రతలు నెలకొల్పటానికి ప్రజలంతా పోలీసులకు సహకరించాలని కోరారు.

జోరుగా అక్రమ మద్యం అమ్మకాలు

అమరావతితోపాటు అన్ని గ్రామాలలో మద్యం అమ్మకాలు జోరందుకున్నాయి. ఆదివారం సాయంత్రం నుంచి మండలంలోని అన్ని మద్యం దుకాణాలకు ఎక్సైజ్ శాఖ సీల్ వేసింది. దీంతో మద్యం ధరలకు రెక్కలొచ్చాయి. మద్యం దుకాణాలు మూయకముందే పెద్దఎత్తున అక్రమ వ్యాపారులు మద్యం పెద్దఎత్తున నిల్వ చేసి అధివారం సాయంత్రం నుంచి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఒక్కొక్క బాటిల్‌కు రూ.50 నుంచి రూ.200 వరకు అధికంగా వసూలు చేస్తున్నారు. అమరావతి, ధరణికోట గ్రామాలలో తెలంగాణ మద్యం విచ్చలవిడిగా అమ్మకాలు సాగిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు.

8 నుంచి ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి నాటికల పోటీలు

పొన్నూరు: రంగస్థల నటులు, నటరాజు కుప్పిలి వెంకటేశ్వరరావు శతజయంతిని పురస్కరించుకుని పొన్నూరు కళాపరిషత్ ఆధ్వర్యంలో ఈనెల 8,9,10 తేదీల్లో 23వ ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి ఆహ్వాన నాటికల పోటీలు నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్షులు ఎస్.ఆంజనేయులు నాయుడు తెలిపారు. సోమవారం పోటీలు నిర్వహించనున్న నిడుబ్రోలు జెడ్పీ హైస్కూల్‌లోని డాక్టర్ నన్నపనేని జ్ఞానేంద్రనాథ్ కళావేదికలో కార్యక్రమాల ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. 8న రాత్రి 7 గంటలకు ఇంద్రప్రస్థం నాటిక, కౌసల్య సుప్రజా రామ నాటిక, సత్యహరిశ్చంద్ర కాటి సీను, నిశ్శబ్దమా నీ ఖరీదెంత నాటిక, 9న రాత్రి 7 గంటలకు రైతేరాజు, శాస్త్రీయ నృత్యం, బంధం నాటిక, జానపద నృత్యం, ఏడనున్నాడో ఎక్కడున్నాడో నాటిక, 10న రాత్రి 7.30 గంటలకు నాలోన నీవే నాటిక, విద్యార్థులచే అభ్యుదయ గీతాలు, క్షేత్రం నాటిక ప్రదర్శన ఉంటాయని తెలిపారు. గౌరవాధ్యక్షులు ఎస్.రఘునాథ్, కార్యనిర్వాహక అధ్యక్షులు ఎ.సాంబశివరావు ఉన్నారు.

ఫుట్‌బాల్ .. ఫుల్‌జోష్!

- ఫుట్‌బాల్ పల్నాడు జిల్లా బాలుర జట్టు ఎంపిక
- 5న ఏఎన్‌యూలో జోనల్ మీట్
- జోనల్ మీట్‌లో పల్నాడు జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహించనున్న క్రీడాకారులు


ఎంపికైన జిల్లా ఫుట్‌బాల్ జూనియర్ బాలుర జట్టు

సత్తెనపల్లి: సత్తెనపల్లి పట్టణంలోని సుగాలి కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో సాగుతున్న ఫుట్‌బాల్ వేసవి శిక్షణ శిబిరానికి క్రీడాకారులు నుంచి చక్కటి స్పందన లభిస్తుంది. ఈ నేపథ్యంలో ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా బాలుర జట్టును సోమవారం ఎంపిక చేశారు. పల్నాడు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శి కె.సుబ్రహ్మణ్యేశ్వర రావు నేతృత్వంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అసిస్టెంట్ సెక్రటరీ ఏ శ్రీరామిరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్లు టి.శ్రీనివాసరెడ్డి, ఐఎస్.నాగిరెడ్డి, ఎస్‌కె.ఎండీ.రియాజ్ ల ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా జూనియర్ బాలుర ఫుట్‌బాల్ జట్టు ఎంపిక చేశారు.

ఎంపికైన క్రీడా కారులు ఈనెల 5న ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరగనున్న జోనల్ మీట్‌లో పల్నాడు జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహించనున్నారు. ఎంపికైన వారిలో పి శివమణి (సత్తెనపల్లి), ఎం.చిన్న వెంకటేష్ (సత్తెనపల్లి), జి గిరిప్రతాప్ (మాదల), షేక్ ఇర్ఫాన్ (మాదల), డి.శివసాయి (సత్తెనపల్లి), వై.శామ్యూల్ (సత్తెనపల్లి), కె ప్రవీణ్ కుమార్ (మాదల), జి ప్రదీప్ (మాదల), ఎస్‌బీ రఫీ (ఇరుకుపాలెం), కె ఆకాష్ (క్రోసూరు), ఏ.నతీష్ (క్రోసూరు), ఎస్‌కె.ఎండీ యాసిన్ (ముప్పాళ్ళ), షేక్ యల్లమంద అషరఫ్ (కొమెరపూడి), షేక్ యల్లమంద నౌషద్ (కొమెరపూడి), వై.యశ్వంత్ రెడ్డి (కొమెర పూడి), ఎస్‌కె.ఎండీ. అష్రఫ్ (సత్తెనపల్లి), టి.దీపక్ (సత్తెనపల్లి), కె.నరేష్ (మాదల) లు ఎంపికయ్యారు.

ఫుట్‌బాల్ అంటే ఎంతో ఇష్టం



నాకు ఫుట్‌బాల్ ఆట అంటే ఎంతో ఇష్టం. పాఠశాల ఉన్నప్పుడు ఆడుకునేందుకు సమయం ఉండేది కాదు. వేసవి సెలవులు రావడంతో నాకు ఇష్టమైన క్రీడలో సాధన చేసుకునే అవకాశం లభించింది. దీంతో ప్రతిరోజూ వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా మైదానానికి వచ్చి సాధన చేసుకుంటున్నా. మెళకువలు నేర్చుకొని జోనల్ మీట్‌లో ప్రతిభ చూపుతా.

–పి.శివమణి, క్రీడాకారుడు, సత్తెనపల్లి

జోనల్ మీట్‌లో గెలుపొందడమే లక్ష్యం



నేను తొమ్మిదవ తరగతి చదువుతున్నా. నాకు ఇష్టమైన ఫుట్‌బాల్ క్రీడలో సాధన చేస్తున్నా. వేసవి శిక్షణ శిబిరంలో కోచ్ చక్కగా శిక్షణ ఇస్తున్నారు. ప్రస్తుతం జిల్లా జూనియర్ జట్టుకు ఎంపికయ్యా. ఈ నెల 5న ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగే జోనల్ మీట్‌లో గెలుపొందడమే లక్ష్యంగా చేసుకుని ఆట ఆడతా.

–ఎం చిన్న వెంకటేష్, క్రీడాకారుడు, సత్తెనపల్లి

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం

- నీటి నిల్వలతోనే దోమలు వ్యాప్తి
- పల్నాడు జిల్లా మలేరియా అధికారి డి రవీందర్ రత్నాకర్
- బోయపాలెం విశ్వతేజ నూలుమిల్లు సందర్శన
- ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు


కార్మికుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న డీఎంవో డి రవీందర్ రత్నాకర్

యడ్లపాడు: దోమకాటు వల్ల వచ్చే వ్యాధుల్లో ప్రధానమైంది మలేరియా అని, ఈ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పల్నాడు జిల్లా మలేరియా అధికారి డి రవీందర్ రత్నాకర్ చెప్పారు. యడ్లపాడు మండలం బోయపాలెం విశ్వతేజ నూలు మిల్లు కార్మిక కుటుంబానికి చెందిన ఇద్దరి చిన్నారులకు మలేరియా పాజిటివ్ సోకిన విషయం తెలిసిందే. వీరిని ఈనెల 28న గుంటూరు జీజీహెచ్‌కు తరలించి సంబంధిత విభాగం అధికారులు ప్రత్యేక వైద్యాన్ని అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం చిలకలూరిపేట మలేరియా సబ్ యూనిట్ అధికారులతో కలిసి డీఎంవో సందర్శించారు. ముందుగా మిల్లు యాజమాన్యంతో కలిసి మాట్లాడారు. యూనిట్ అధికారుల ద్వారా ప్రస్తుతం జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాధితుల గురించి ఆరా తీశారు. మలేరియా సోకిన వారు గతనెల 7న సార్వత్రిక ఎన్నికలకు తమ స్వగ్రామం అనకాపల్లి జిల్లా దేవరపల్లి మండలం పాడేరు గ్రామం వెళ్లి ఓటు హక్కు వినియోగం అనంతరం 18న తిరిగి మిల్లుకు వచ్చినట్లు డీఎంఓకు తెలిపారు. అక్కడి నుంచే వచ్చినపుడే కుటుంబ సభ్యులకు జ్వరం ఉన్నట్లు గుర్తించినా వైరల్ ఫీవర్‌గా ప్రైవేటు వైద్యుల వద్ద చికిత్స పొందారని, మలేరియా లక్షణాలు గుర్తించిన వెంటనే అదే నెల 28న గుంటూరు జీజీహెచ్‌కు తరలించి వైద్యసేవలు అందిస్తున్నట్లు ఆయనకు వివరించారు. ప్రస్తుతం బాధితులకు జ్వరం నుంచి కోలుకున్నట్లు వెల్లడించారు.

మిల్లు ప్రాంగణంలో మెడికల్ క్యాంపు

మలేరియా సబ్‌యూనిట్ అధికారి నారాయణ ఆధ్వర్యంలో యుద్ధప్రాతిపదికన మిల్లు ప్రాంగణంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ముందుగా యాజమాన్యం, సిబ్బంది, కార్మికులకు మలేరియాపై అవగాహన కల్పించారు. మిల్లులోని అంతర్గత మురుగు కాల్వలు, నిటి నిల్వలు ఉన్న ప్రదేశాల్లోనూ మిల్లులోని క్వార్టర్స్ బ్లాకుల్లో ఉన్న 61 నివాసాలకు ఐఎస్‌ఎస్ స్ప్రేను చల్లారు. మిల్లు సిబ్బంది కార్మికుల కోసం నిర్మించిన బ్లాక్‌లోని 352 నివాసాలలో ఉంటున్న వారిని సర్వే నిర్వహించారు. శిబిరం ద్వారా 252 మందికి రక్తపరీక్షలు చేశారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

డీఎంఓ మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉంటూ పలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ, దోమతెరలు వాడాలన్నారు. అనుమానిత జ్వరాలు వస్తే తక్షణమే వైద్యుల్ని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో చిలకలూరిపేట యూనిట్ అధికారులు, సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు ఉన్నారు.

స్ట్రాంగ్ రూమ్ ఓపెన్‌తో మొదలు...

సత్తెనపల్లి: మంగళవారం ఉదయం 6 గంటలకు కౌంటింగ్ కేంద్రాలకు ఏజెంట్లు, అధికారులు కలిసి స్ట్రాంగ్ రూంను ఓపెన్ చేసే కార్యక్రమం పకడ్బందీగా నిర్వహిస్తారు.

ఏజెంట్ల సమక్షంలో స్ట్రాంగ్ రూం ఓపెన్ చేయనున్నారు. ఈవీఎంలను నమోదు చేసుకునేందుకు స్ట్రాంగ్ రూములో ఒక నోడల్ ఆఫీసర్ ఉంటారు. ఈవీఎంలను కౌంటింగ్ కేంద్రంలోకి తీసుకురాగానే వాటికి సీల్ సరిగా ఉందా లేదా అని పరిశీలిస్తారు. ఈవీఎంలో బ్యాటరీలు పనిచేయకపోతే మార్చి ఆన్ చేస్తారు.

- ఓట్ల లెక్కింపులో ఏవైనా సందేహాలు వచ్చినప్పుడు ఆర్వోలతో మాట్లాడి సందేహాలు నివృత్తి చేసుకో వాలి. ముఖ్యంగా పోస్టల్ బ్యాలెట్లు, హోం ఓటింగ్, సర్వీస్ ఓటర్లు (ఈటీపీఎస్ బీఎస్), ఓట్లు ఏవిధంగా లెక్కించాలి అనే దానిపై ఇప్పటికే శిక్షణ ఇచ్చారు.
- ఈవీఎంలను కేంద్రంలోకి తీసుకొచ్చేందుకు సిబ్బందిని కేటాయించారు. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సిబ్బందికి వేర్వేరు యూనిఫాం ఇచ్చారు. రౌండ్ పూర్తయ్యాకే మరో రౌండ్‌కు సంబంధించి కంట్రోల్ యూనిట్లు తీసుకురావాల్సి ఉంటుంది. కౌంటింగ్ కేంద్రాల్లోకి వెళ్లే వారికి ఐడీ కార్డులు తప్ప, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు, సెల్‌ఫోన్లు ఉండరాదు.
- ఓట్ల లెక్కింపు పూర్తి కాగానే ఎన్‌కోర్‌లో నమోదు తర్వాతే ఫలితాలను ఆయా నియోజక వర్గాల రిటర్నింగ్ అధికారులు వెల్లడించనున్నారు. పోస్టల్ బ్యాలెట్, సర్వీస్ ఓట్ల లెక్కింపుకు ఒక ఏఆర్‌ఓ, కంప్యూటర్ అసిస్టెంట్, సూపర్‌వైజర్, మైక్రో అబ్జర్వర్ ఉంటారు. కేంద్ర పరిశీలకులు కౌంటింగ్ ప్రక్రియ, ఫలితాలు వెల్లడి, డిక్లరేషన్ వరకు దగ్గరుండి పరిశీలిస్తారు. కౌంటింగ్ పూర్తికాగానే ఫలితాలు ప్రకటించి గెలుపొందిన అభ్యర్థికి ఫారం–21 అందజేస్తారు.

20 మంది చిన్నారులకు కోత, కుట్టులేని చికిత్స



గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రి ఆర్థో పెడిక్ విభాగాధిపతి డాక్టర్ యశశ్వి రమణ ఆధ్వర్యంలో సోమవారం క్లబ్ ఫుట్ దినోత్సవాలు ఆర్థోపెడిక్ ఓపీ వైద్య విభాగంలో నిర్వహించారు. 20 మంది క్లబ్ ఫుట్ పిల్లలకు పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన ఆపరేషన్లు కోత, కుట్లు లేకుండా ఉచితంగా చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు డాక్టర్ రమణ యశశ్వి తెలిపారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ మాట్లాడుతూ క్లబ్ ఫుట్ దినోత్సవం జరిపి వంకర పోయిన కాళ్ళు, పాదాలను కోత, కుట్లు లేకుండా సరిచేసే చికిత్స అందించడం అభినందనీయమన్నారు. జన్యు లోపం వల్ల కొంత మంది చిన్నారులు వంకర కాళ్లతో పుడతారన్నారు. గ్రామాల్లో వంకర కాళ్లతో పుట్టిన చిన్నారులను క్యూర్ ఇండియా సంస్థ గుర్తించి జీజీహెచ్‌కు తీసుకొచ్చినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్‌లు డాక్టర్ వి.వి.నారాయణ, డాక్టర్ పాటిబండ్ల అనిల్‌బాబు, డాక్టర్ సింధూర, డాక్టర్ సుస్మిత, డాక్టర్ శ్రీకాంత్, సుబ్బరాయన్, క్యూర్ ఇండియా ప్రతినిధి శిరీష, టీనా పాల్గొన్నారు.